మిస్సయిన టీటీడీ బస్సు..నాయుడుపేట వద్ద లభ్యం

నాయుడుపేట, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త

తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన రూ.2 కోట్లు విలువైన బస్సు మాయమై నాయుడుపేట సమీపంలో లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమలలో కొండ మీద తిరిగే భక్తుల సౌకర్యార్థం ఉచితంగా నడిపే రూ.2 కోట్లు విలువ చేసే ఏసీ ఎలక్ట్రికల్ బస్సును గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోరీ చేశారు. ఈ బస్సు చోరీపై టీటీడీ అధికారులు తిరుమల క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బస్సులో అమర్చి ఉన్న జిపిఎస్ ఆధారంగా బస్సును నాయుడుపేట సమీపంలోని బిరదవాడ వద్ద జాతీయ రహదారిపై హైవే పోలీసులు గుర్తించారు. అయితే ఎలక్ట్రికల్ బస్సు కావడంతో ఛార్జింగ్ అయిపోవడంతో దుండగులు వదిలేసి పారిపోయినట్లు తెలుస్తోంది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ముత్యాలమ్మకి బంగారు హారం బహుకరణ

చిల్లకూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త



తూర్పు కనుపూరు గ్రామంలో వెలసివున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం నెల్లూరు నగరానికి చెందిన డి. శ్రీనివాస దంపతులు ముత్యాలమ్మ అమ్మవారికి 70 వేల రూపాయిలు విలువ కలిగిన బంగారు హారాన్ని ఆలయ ఈఓ కె. నవీన్ కుమార్ కమిటీ సభ్యులకు అందజేసారు. అనంతరం వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, దువ్వూరు సాయి కృష్ణా రెడ్డి, బాలు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై ఏకదంతుడు

ఆదివారం రాత్రి గజవాహనంపై ఊరేగుతున్న గజాననుడు

కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి విఘ్ననాయకుడైన గణనాథుడు ఉభయదేవేరులతో కలిసి గజవాహనంపై కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తమిచ్చారు. బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి గజవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం వన్నియర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో యాగమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. తిరిగి రాత్రి అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ దేదీప్యమానంగా అలంకరించిన గజవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు బాబు, సురేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవానికి భారీ ఏర్పాట్లు: ఆలయ ఛైర్మన్, ఈఓలు

కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

బ్రహ్మోత్సవాలో భాగంగా సోమవారం జరుగనున్న రథోత్సవంకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు.ఆదివారం వారు మాట్లాడుతూ సోమవారం రథోత్సవంను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరికి త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు ఆలయంలో వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపడుతున్నట్లు తెలిపారు. తిరిగి స్వామివారి రథోత్సవం మధ్యాహ్నం ప్రారంభమవుతుందని చెప్పారు. రథోత్సవం సందర్భంగా తరలివచ్చే భక్తులకు అన్నదానం ఉదయం నుండి రాత్రి వరకు ఉచిత భోజనవసతి నిరంతరాయంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. సోమవారం జరుగనున్న రథోత్సవంకు పటిష్ట భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు డీఎస్పీల ఆధ్వర్యంలో చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు.ఎస్సైలు, సిబ్బందితో కలసి 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రథోత్సవం ముందస్తు ఏర్పాట్లులో భాగంగా ఆది వారం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, స్థానిక ఎస్సై శ్రీనివాస్, సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సిబ్బంది పురవీధులను పరిశీలించారు.

చంద్రప్రభపై శ్రీనివాసుడు

తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాతవార్తప్రతినిధి:

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి చంద్రప్రభవాహనంపై చేతిలో బంగారువెన్నకుండను ధరించిన శ్రీకృష్ణుడుగా మలయప్పస్వామి దర్శనమిచ్చాడు. చంద్రప్రభతోకూడిన వాహనంపై విహరించిన స్వామి సేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

బ్రహ్మాండనాయకునికి కళాబృందాల నీరాజనం

తిరుమల,సెప్టెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:

బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఆదివారం ఉదయం సూర్యప్రభవాహన సేవలో కళాబృందాల నీరాజనం సమర్పించారు. ఆంధ్ర,తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన 10కళా బృందాలు, 243మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. వారివారి కళాపైపుణ్యంతో అలరించారు. టిటిడి హిందూ ధార్మికప్రాజెక్టుల ప్రోగ్రామింగ్ అధికారి రాజగోపాలరావు, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీనివాసులు, డిఎస్‌పి ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు కళాకారుల నృత్యోత్సవాలను పర్యవేక్షించారు. తిరుమల స్థానికులతో బాటు ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి సతీమణి, టిటిడి జెఈఓ సదాభార్గవి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోలాటం ఆడి దేవుని సేవలో భక్తిని చాటుకున్నారు.

కోలాహలంగా విఘ్ననాయకుడి నిమజ్జనం

తిరుపతి,సెప్టెంబర్ 24ప్రభాతవార్త:

ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను ఆయా నిర్వాహకులు ఆదివారం ప్రశాంతంగా ఊరేగింపుగా తీసుకెళ్ళి సాగర్‌లో నిమజ్జనం చేశారు. వరసిద్ధివినాయక కమిటీ నిర్వాహకులు నవన్‌కుమార్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ తదితరులు,పోలీసు అధికారులు అన్ని సహాయసహకారాలతో నిమజ్జనాలు జరిగాయి.

వందేభారత్ రైలుకు ఘనస్వాగతం

వందేభారత్‌రైలుకు స్వాగతం పలుకుతున్న పవిత్రారెడ్డి, బిజెపి నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

విజయవాడ నుంచి చెన్నైకు నూతనంగా ప్రారంభించిన వందేభారత్ రైలును శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల సందర్శనార్థం కొద్దిసేపు నిలిపారు. ఈరైలును శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి, ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ, డిఎస్‌పి షేక్.షాను, బిజెపి నాయకులు ఎం.సుబ్రమణ్యంరెడ్డి, సీనియర్ డిఎస్ఓ చంద్రశేఖర్,స్టేషన్‌మేనేజర్ యు.మన్‌మోహన్‌కృష్ణలు హాజరయ్యారు. రైలు శ్రీకాళహస్తి స్టేషన్‌కు చేరుకోగానే జాతీయ జెండాను చేతపట్టుకుని భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం రైలులో ఎక్కి వసతులు ఎలా ఉన్నాయో ప్రయాణీకుల వద్ద అడిగి తెలుసుకున్నారు. 11 రాష్ట్రాలను కలుపుతూ 9వందేభారత్‌రైల్లును నేడు కేంద్రం ప్రారంభించడం ఎంతో సంతోషమని అతిథులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు యువత, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఏపీపీఎస్సీ ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలు

పకడ్బందీగా ఏర్పాట్లు : డిఆర్‌ఓ

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

ఈ నెల 25వ తేది సోమవారం నుండి 11 కేటగిరీలలో ఉద్యోగ నియామకాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహణ ఉంటుందని ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సి పరీక్షల నిర్వహణపై జిల్లా రవెన్యూ అధికారి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేది నుంచి అక్టోబర్ 6వ తేది వరకు ఈ నెల 28న, అక్టోబర్ 2వ తేది మినహా ఈ పరీక్షలు ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ గ్రేడ్ 2, టెక్నికల్ అసిస్టెంట్ (జియో - ఫిజిక్స్), గ్రౌండ్ వాటర్ సబ్ - సర్వీస్, ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్, తెలుగులో జూనియర్ అనువాదకుడు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ మైన్స్, జియాలజీ సబ్ - సర్వీస్, ఫుడ్ సేఫ్టి ఆఫీసర్, గ్రూప్ 4 సేవలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ సంబంధించి ఈ పరీక్షలు పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షలని జిల్లాలో 3 కేంద్రాల్లో రెండు షెసన్స్‌లో నిర్వహణ వుంటుందని అన్నారు. 3363 మంది హాజరుకానున్నారని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు ఆర్టిసి సత్యనారాయణ, వైద్య శాఖ డా. ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంకు వెళ్లి బావిలో వ్యక్తి గల్లంతు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఓ వ్యక్తి బావిలో గల్లంతైన సంఘటన ఆదివారం మండలంలోని నూలుకుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. ఆదివారం గ్రామంలో వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన శ్యామమూర్తి (42) అనే వ్యక్తి విగ్రహం నిమజ్జనం సందర్భంగా బావిలో దిగి గల్లంతయ్యాడని తెలిపారు. వెంటనే స్థానికులు కుప్పం ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలికి చేరుకుని బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి ఏడున్నర దాకా శ్యామమూర్తి ఆచూకీ తెలియరాలేదు. సంఘటనా స్థలం వద్ద పెద్ద ఎత్తున గ్రామస్తులు గుమికూడారు. కాగా బావిలో గల్లంతైన శ్యామమూర్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం.

బావి వద్ద గుమికూడిన గ్రామస్తులు

పులికాట్ పూడికతీత పనులు డిసెంబర్‌లోనే

- రెండు మూడు నెలల్లోనే పూర్తిచేస్తాం
- 112 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్
- మత్స్యకార ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సంజీవయ్య

తడ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో విస్తరించిన పులికాట్ సరస్సు ఉత్తర భాగంలో సముద్రం వద్ద ముఖద్వారం పూడికతీతకు ఏపీ ప్రభుత్వం రూ.112 కోట్లు మంజూరు చేసినట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఈ పనులు డిసెంబర్ నెలలో ప్రారంభించి రెండు మూడు నెలల్లోనే పూర్తి చేస్తామన్నారు. ఆదివారం తడలో జరిగిన మత్స్యకార ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పులికాట్ సరస్సులో ప్రతి వేసవికాలం నీళ్లు తగ్గిపోతున్న కారణంగా సరస్సు దక్షిణం వైపు తమిళనాడు ప్రాంతానికి జాలర్లు వేటకు వెళుతున్నారని, అక్కడ దాడులకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగాళాఖాతం, పులికాట్ సరస్సు మధ్యన వాకాడు మండలం రాయదొరువు ప్రాంతంలో పూడికతీత పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆప్కాస్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు కూడా తమకు సహకరించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం మత్స్యకార భరోసా కింద మండలంలోని 1550 మందికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇరకం దీవి కుప్పం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని, త్వరలోనే వారికి కోరుకున్న సదుపాయాలు అందుతాయని స్పష్టం చేశారు. ఆప్కాస్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు మాట్లాడుతూ చేపల వేట సమయంలో బోట్లకు వాడే సబ్సిడీ డీజల్ కోసం ఇప్పటిదాకా కోట వరకు వెళ్లేవారని, ఇక నుంచి తడ మండలం కొండూరు వద్దనే ఇది అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమం కోసం ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారని, పలు కీలక పదవులు కూడా మత్స్యకారులకు ఇస్తున్నారని చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ జయలక్ష్మి, తడ మండల వైసీపీ అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ కె.ఆర్యుగం, మత్స్యశాఖ అధికారులు శ్రీనివాస నాయక్, రాజేష్, పలువురు మత్స్య సొసైటీ నాయకులు పాల్గొన్నారు. తడ మండలం అధికార పార్టీకి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తడ సర్పంచ్ కె.ఆర్యుగంను ఈ సందర్భంగా పలువురు సన్మానించారు. ఇదిలావుంటే ఈ కార్యక్రమంలో తడ మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులతో పాటు కీలక నేతలు హాజరు కాకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

రాక్షస ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..తెదేపా

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

రాక్షస ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు. ఆదివారం తెలుగుదేశంపార్టీ కార్యాలయం సమీపంలో తెలుగుదేశంపార్టీ చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ సత్రవాడ మునిరామయ్య, మాజీ ఎంఎల్ఏ ఎస్సీ వీనాయుడు తనయుడు ఎస్సీ వీదిలీప్‌లు పాల్గొని తమ సంఘీభావం తెలిపి పోస్టుకార్డు ద్వారా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు 'బాబుతో మేము' సందేశం తెలియపరచారు. ఈ సందర్భంగా విజయకుమార్‌నాయుడు మాట్లాడుతూ అన్యాయంగా అక్రమంగా ఒక నీతి నిజాయితీ వంతుడిని అరెస్టు చేయించడం దుర్మార్గమన్నారు. తమ నాయకుడు చంద్రబాబు కేసుల నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, దశసధాచారి, తిరుపతి పార్లమెంటు కోశాధి కారి కంఠా రమేష్, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెంచయ్యనాయుడు,రాష్ట్ర మహిళా నాయకు రాలు బి.రేణుకాదేవి, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి అనిత, కుమారి, సుప్రజ, మండల మహిళా అధ్యక్షురాలు సుభాషిణి, రత్నమ్మ, రాష్ట్ర ఎస్సీ సెల్ గోపినాథ్, నియోకజవర్గ ఎస్సీ సెల్ రమేష్, గుర్రప్పశెట్టి, భాస్కర్‌గౌడ్, శివారెడ్డి, శంకర్ నాయుడు, కాసరం రమేష్, ఆర్యుగం, బిసి నాయకుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, కుమార్, ప్రకాష్, రమేష్, గుర్రప్పశెట్టి, భాస్కర్‌గౌడ్, శివారెడ్డి, శంకర్‌నాయుడు, గాలిమురళీనాయుడు, ప్రకాష్ నాయుడు, మునిరాజనాయుడు, డివినారాయణ, ఖాదర్‌బాష, అస్మత్, మస్తాన్, జిలానీ, హేమంత్ కుమార్, ప్రసాద్‌నాయుడు, ప్రతాప్, దొరబాబు, నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), నాగరాజు, బాబు, మణి, యాదగిరి, మునిరాజ, వజ్రం కిషోర్, శేషమనాయుడు, రాజేంద్రనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, సురేష్‌నాయుడు, వెంకటరత్నం, నాగరాజు, శ్రీనివాసులు, కరీం, జిలానీ, మీర్జా, బాబురెడ్డి, చాంద్‌బాషా, మణి, రామచంద్రయ్య, రామ్మూర్తి, గురుమూర్తి, వెంకటరమానాయుడు, సుబ్బారావు, సాయి, వినయ్, సుజిత్‌కుమార్, గోవిందు, భాస్కర్‌నాయుడు, గుత్తావిజయకుమార్‌నాయుడు, భార్గవ్, మణికంఠ, పాండు, ఎంఎస్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

తిరుపతికి తరలి వెళ్ళిన జనసైనికులు

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
తిరుపతిలో ఆదివారం జరిగిన జనసేన పార్టీ క్రీయాశీలక కార్యకర్తలు, నాయకుల సమావేశానికి చిత్తూరు నుండి పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దయారాం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో జనసైనికులు తరలివెళ్ళారు. తిరుపతికి తరలివెళ్ళిన జనసే నాయకుల్లో దేవినేని యశ్వంత్, భానుప్రకాష్, సంతోష్, మురళీ, పవన్, సుధాకర్, వెంకటేష్, శిరీష, జయంతి, వనిత, ఆరణి అంజలి తదితరులు వున్నారు.

గ్రామాల్లో శ్రీ వరసిద్ధివినాయకస్వామి ధర్మప్రచార రథం

శాంతిపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

ప్రభుత్వ దేవదాయ,ధర్మాదాయ శాఖ, కాణిపాకం శ్రీ స్వయంభువరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అధ్వర్యంలో ఆదివారం మండలంలోని రాళ్లబూదుగూరులో ధర్మ ప్రచార రథం ద్వారా ఉత్సవాల ప్రచారం నిర్వహించారు. పురవీధుల్లో ప్రచార రథాన్ని ఊరేగించారు. ఈసందర్భంగా వేదపండితులు, అర్చకులు మాట్లాడుతూ భక్తుల చెంతకే భగవంతుడు అని పేర్కొన్నారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాల కరపత్రాలను ప్రజలకు పంచారు. అక్టోబర్ 15వతేది వరకు వివిధ గ్రామాలు, పట్టణాల్లో ప్రచార రథం తిరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో సిబ్బంది, అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువైన 6 కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితులు అరెస్టు

చిత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది ఆదివారం కట్టమంచి పరిసరాల్లో దాడులు నిర్వహించి 2 లక్షల రూపాయల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల మేరకు కట్టమంచి పరిసర ప్రాంతాల్లో భారీగా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం రావడంతో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో తన ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది కట్టమంచి పరిసరాల్లో విస్తృతంగా గాలించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులను పట్టుకొని వారి నుండి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరు గంజాయిని పూతలపట్టు మండలం బండపల్లి నుండి రవాణా చేసుకొని స్థానికంగా విక్రయాలు చేసేవారన్నారు. ఈ కేసుకు సంబంధించి నిందితుల నుండి ఒక వాహనంను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన నిందితుల్లో చిత్తూరు నగరానికి చెందిన మురుగన్(56), చిత్తూరు కట్టమంచి రెడ్డి స్ట్రీట్‌కు చెందిన ఎస్.ఉమాపతి(59), పూతలపట్టు మండలం బండపల్లికి చెందిన పి.వెంకటేష్(32)లు వున్నారు. వీరిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ప్యాక్టరీ కాల్యుష్యం బారినుండి కాపాడండి

తవణంపల్లె, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
మండలంలోని కామాలూరు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన మ్యాంగో ఫల్ప్ ప్యాక్టరీ కాలుష్య బారి నుండి తమను కాపాలడాలని కామాలూరు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కామాలూరు గ్రామ సమీపంలో గత కొంత కాలం క్రితం ఏర్పాటు చేసిన మ్యాంగో పల్ప్ ప్యాక్టరీ యాజమాన్యం నిబంధనలను అతిక్రమించి ప్యాక్టరీని నడుపుతూ వ్యర్థపదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో కామాలూరు పరిసర ప్రాంతాలు పూర్తిగా కలుషితం అయ్యాయని వాపోయారు. ప్యాక్టరీ వారు పడేసిన మామిడి ముట్టెలు, వంటి వ్యర్థాలు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గ్రామ సమీపంలోని చెరువులు, కుంటల్లోకి చేరి త్రాగునీరు కలుషితమవడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. ఈవిలేకరుల సమావేశంలో తులసీరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, బాబురెడ్డి, కామాలూరు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో సిఆర్‌రెడ్డి విద్యార్థుల ప్రతిభ

.తొట్టంబేడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త
శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిగ్రీ మూడవ సెమిస్టర్(2022-23) ప్రకటించిన పరీక్ష ఫలితాలలో తొట్టంబేడు మండలంలోని డాక్టర్ సిఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల బిఏ కోర్సులో డిజె.గణేష్ 8.57, ఎస్ఆర్.నఫిసా 8.40,బి.కాంలో ఎ.పూజితాకు 8.89, ఎ.హిమశ్రీకి 8.59, బిఎస్సీలో వి.దేవిక 8.51, బిబిఏలో పి.సుమంత్ 7.60 పాయింట్లు సాధించారు. ఈసందర్భంగా పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ కంభంపాటి యశోద, కరస్పాండెంట్ డాక్టర్ సి.రాజగోపాల్‌రెడ్డి మరియు అధ్యాపక బృందం అభినందించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

విజయపురం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త : మండలంలోని ఎల్లసముద్రంలో గణేష్ నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం యువత రంగులు చల్లుకుని ఉల్లాసంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం మేళతాళాలతో వినాయకుడిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఐఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

తిరుపతి ఎస్వీయు ప్రకటించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్ఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పట్టణ టాపర్లుగా నిలిచారని కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బిబిఎ విభాగంలో సౌమ్యశ్రీ 9.17శాతం, బికామ్‌లో సుమ9.17, బిఎస్సీ(ఎంపిసిఎస్)లో భువనేశ్వరి 9.01, బిజెడ్‌సివిభాగంలో మేఘన 8.51శాతం మార్కులతో పట్టణ టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే శివరంజని, భవాని, రషిక, బిందు, హర్షిత, మేఘన, కావేరి, ఉమ్మేకులుసుమ్, ఉమాదేవిలు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా ఛైర్మన్ విద్యార్థులను అభినందించారు.

ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరం

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్
కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

అత్యంత నాణ్యమైన వైద్యసేవలతో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరమని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాలుర హైస్కూల్‌లో బెంగళూరు వైదేహి ఆస్పత్రి, సాయిమాతా సేవా ట్రస్ట్‌ల అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంను ఆయన ప్రారంభించారు. పేద ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా కార్డియాలజీ, న్యూరాలజీ, ఆంకాలజీ, ఇఎన్‌టి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు చెందిన వైద్యులు సుమారు 320మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. అవసరం ఉన్న రోగులను బెంగళూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, కౌన్సిలర్‌నాగరాజు,వైద్య బృందం డా॥ లోకేష్, సిబ్బంది, ఆంజనేయ గుడి ఛైర్మన్ కుమరేష్ పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

రామకుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

స్థానిక రెడ్డి వీధి బైపాస్ రోడ్‌లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. వారం రోజులపాటు ప్రత్యేక పూజలు, అన్నదానం చేపట్టారు. ఆదివారం వినాయక విగ్రహాన్ని యువత పుర వీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. 17 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన వికాయక విగ్రహం ప్రత్యేకంగా ప్రజలను ఆకర్షించింది.

రెండుమందికి ఉచితంగా గుండె పరీక్షలు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

లయన్స్‌క్లబ్ కుప్పం, కోలారు ఆర్ఎల్ జాలప్ప నారాయణ హార్ట్ సెంటర్ అధ్వర్యంలో ఆదివారం స్థానిక బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష శిబిరంకు విశేష స్పందన లభించింది. సెమారు రెండు వందలమందికి ఉచి తంగా పరీక్షలు నిర్వహించి వారిలో పదిమందిని ఉచిత గుండె శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్ తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే పేదల కోసం ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి పిజి సెల్వం, ప్రసాద్, రవీంద్రనాథ్, లెనిన్, శివప్రసాద్, శివకుమార్, సోమశేఖర్, సెంథిల్‌కుమార్,చరణ్,కృష్ణమూర్తి, బిఆర్‌డి ఆస్పత్రి సిబ్బంది ప్రమోద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గంగవరం, సెప్టెంబరు 24, ప్రభాతవార్త :
గంగవరం పోలీసులు ఆదివారం ఉదయం అంగన్‌వాడీ వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు.రాష్ట్ర స్థాయి నాయకుల పిలుపు మేరకు నేడు విజయవాడలో తమ సమస్యల పరిష్కారం కొరకు దర్నా కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గం నుండి అంగన్‌వాడీ వర్కర్లు ఓ ప్రైవేటు బస్సులో బయల్దేరి వెళ్తుండగా విషయం తెలుసుకున్న గంగవరం పోలీసులు బెంగళూరు చెన్నై జాతీయ రహదారి దండపల్లె క్రాస్ వద్ద బస్సుతో అంగన్‌వాడీ వర్కర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ వర్కర్లు మాట్టాడుతూ తమ న్యాయ పరమైన సమస్యల పరిష్కారం కోసం దర్నాకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

భక్తులతో పోటెత్తిన బోయకొండ

బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 24 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం బోయకొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొండ దినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేకాభిషేకం, అలంకరణగా వించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. ఇఓ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు సేవలందించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలు

చౌడేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

స్కూటర్ కల్వర్టును ఢీకొని భార్యభర్తకు గాయాలైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో తిరుపతి వైపు వెళుతున్న టూవీలర్ కడియాలకుంట సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దగల ఓ కల్వర్టును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పీలేరు కొత్తపేటకు చెందిన రమేష్(35), మంజుల(28)లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చుట్టుపక్కల వారు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తవణంపల్లెలో ఘనంగా గణేష్‌నిమజ్జనం

కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు సోమవారం గణేష్‌నిమజ్జనంను అత్యంత ఘనంగా నిర్వహించారు. మండలంలో వినాయకచవితి పండుగను సోమవారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్న విషయం విధితమే. ఈమేరకు వినాయకచవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఏడవరోజు ఆదివారం నిమజ్జనంను నిర్వహించారు. ఏడు రోజులు పాటు వినాయకస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించిన భక్తులు ఆదివారం గ్రామాల్లో మంగళవాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ళ నడుమ భారీ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటలకు తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు.

బాబుతో నేను అని గొంతెత్తి నినదిద్దాం

తెదేపా పరిశీలకుడు ఖాదర్ బాషా
కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు బాబుతో నేను అని గొంతెత్తి నినదించాలని కుప్పం తెలుగు దేశం పార్టీ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ అధ్వర్యంలో బాబుతో నేను కరపత్రాలను ముస్లిం మైనార్టీలకు అందించి మద్దతు కోరారు. చంద్రబాబునాయుడు ఏ తప్పు చేయలేదని అన్యాయంగా జైలుకు పంపారని వారు పేర్కొన్నారు. చదువుకున్న యువతకు శిక్షణ కల్పించడం నేరమా అని ప్రశ్నించారు. సైకో క్రిమినల్‌గా సిఎం జగన్ మారారని ప్రజల దీవెనలు చంద్రబాబుకు కావాలని రా ష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి తలపై రెండులక్షల అప్పులు పెట్టి తన ఖజానా నింపుకున్న సిఎం జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా మైనార్టీ నేతలు అస్లం, ఇమ్రాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు-ర్యాలీ

తొట్టంబేడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

తొట్టంబేడు ఎస్వీఏ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి రంగురంగు కాగితాలతో చక్కగా అలంకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ పి.సుధాకర్ అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ పిఓ కెసి.రేణుకమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అంటూ కళాశాల నుంనచి చెంచులక్ష్మి కాలనీమీదుగా ఏరియా ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ శతజయంతి వేడుకల్లో భాగంగా 1969లో సెప్టెంబర్ 24న దేశవ్యాప్తంగా ప్రారంభించారని తెలిపారు. వాలంటీర్లు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, కమ్యూనిటీ భాగస్వామ్యం, పరస్పర సహకారం పెంపొందించాలని దేశ సమైక్యతకు కృషిచేయాలని కోరారు. ఉత్తమ వాలంటీర్లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీహరిరెడ్డి, నాగసరోజలక్ష్మి, హేమలత, ఉదయలక్ష్మి పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

భక్తులపాలిట కొంగుబంగారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం

కోట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారమై పూజలు అందుకుంటోంది. 1964లో నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలోని కోనేరులో స్వయంభువుగా వెలసిన శ్రీప్రసన్న ప్రసన్న వెంకటేశ్వరునికి భక్తులు చిన్న ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహించేవారు. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో జీర్ణోద్ధరణలో భాగంగా 2004లో నూతన ఆలయానికి శంకుస్థాపన చేసి 2007లో భక్తుల సహకారంతో కుంభాభిషేకం నిర్వహించారు. నాటి నుంచి నేటి వరకు 16 సంవత్సరాల పాటు ప్రతి శనివారం స్వామికి అభిషేకాలు, బుధవారాల్లో భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాంతోపాటు ఆలయంలో ప్రతి ఉగాది రోజున శ్రీదేవి భూదేవి ప్రసన్న వెంకటేశ్వరస్వామివార్లకు కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి వైకుంఠ ఏకాదశికి స్వామికి పూలంగిసేవ నిర్వహిస్తారు. స్వామి కల్యాణం చేయడానికి ఆలయంలో తగిన స్థలం లేకపోవడంతో ఆలయానికి అనుబంధంగా ఈ సంవత్సరం శ్రీనివాస కల్యాణ వేదికను నిర్మించారు. ఇకపై ప్రతి సంవత్సరం స్వామివారి కల్యాణం ఈ వేదికపైనే జరుగుతుంది. చుట్టుపక్కల భక్తులు తమ పిల్లలకు వివాహం చేసేందుకు ఈ కల్యాణ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని ఆలయ ఛైర్మన్ నేదురుమల్లి ప్రసేన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

175 నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపే లక్ష్యం

జిల్లా వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:
2024లో జరగబోవు ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనని చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో రాపూరు, కలువాయి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలలో ఎన్నికలు ఉండవచ్చని సూచనప్రాయంగా తెలిపారు. ఎన్నికలకు అందరూ సమాయత్తం కావాలని చెప్పారు. రాపూరు మండలం నుండి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో వైసీపీ భారీ మెజారిటీతో గెలవాలన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం అస్త్రంగా వినియోగించాలని సూచించారు. పేదల సంక్షేమమే సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం అని తెలిపారు. సమావేశంలో రాపూరు మండల పార్టీ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలు

గూడూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

గూడూరులో పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మోదుర వన వినాయక దేవస్థానంలో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడూరు అభివృద్ధి ప్రదాత, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలు పనబాక దంపతుల అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు సమీపంలోని మోదుగ వన వినాయక దేవస్థానంలో అడవిలో వినాయకునికి అభిమానులు ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించారు. అభిమానులు ఉడతా శరత్‌యాదవ్, మేకా శివకుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధిలో పనబాక కృష్ణయ్య తనకంటూ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనుబోయిన చందు యాదవ్, సురేష్, సుజిత్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వంజివాకలో మహిళ ఆత్మహత్య

కోట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త
కోట మండలం వంజివాక హరిజనవాడలో హరిత (23) శనివారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. హరితకు ఇద్దరు చిన్న పిల్లలు. చిన్నపాపకు ఆరోగ్యం సక్రమంగా లేదని, ఆసుపత్రికి తీసుకెళ్లాలని తన భర్త రమేష్‌కు చెప్పింది. అయితే రమేష్ కొంత జాప్యం చేయడంతో మనస్తాపానికి గురైన హరిత ఇంట్లోనే తలుపులు వేసుకొని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు చెప్తున్నారు. ఆ మేరకు భర్త వచ్చి చూసేలోగా తలుపులు వేసుకొని ఉండటంతో కిటికీ గుండా తన భార్య ఉరేసుకోవడాన్ని చూసి ఇరుగుపొరుగు వారికి చెప్పారు. చుట్టుపక్కల వారు వచ్చి చూడగా ఆమె ఉరేసుకొని మృతిచెందింది. దీంతో హుటాహుటిన కోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి సిబ్బంది ఆ మహిళను చూసి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆదివారం కోట ఎస్ఐ పుల్లారావు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. హరిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహిళ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

చంద్రబాబును ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

వెంకటగిరి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

మాజీ సీఎం చంద్రబాబునాయుడుని రాజకీయంగా ఎదుర్కోలేక సీఎం జగన్మోహన్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో శుక్రవారం గంగోటి నాగేశ్వరరావు ఇంటి వద్ద ఉన్న పార్కులో రిలే నిరాహార దీక్షలు 12వ రోజు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ కావలనుకుంటే సైకో లాంటి ముఖ్యమంత్రి ఉంటే జరగదన్నారు. మంచి అడ్మినిస్ట్రేషన్ కావాలనుకుంటే 2024లో చంద్రబాబునాయుడుని గెలిపించుకుంటే మన రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి అవ్వారు సత్యనారాయణ మాట్లాడుతూ ఎవిడెన్స్ లేకపోయినా అక్రమంగా అరెస్ట్ చేసి చంద్రబాబును రిమాండ్‌కు పంపించి పైశాచిక ఆనందం పొందుతున్నట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు నీతి నిజాయితీ కలిగిన నాయకుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువత కార్యదర్శి కె.వి.కె.ప్రసాద్‌నాయుడు, డక్కిలి మండల అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరంరెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ప్రాంగణ ఎంపికలు

కోట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త
కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శనివారం బెంగళూరుకు చెందిన ఎలక్ట్రికల్ సంస్థ, కోర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలలో బిటెక్ ఆఖరు సంవత్సరం చదువుతున్న ట్రిపుల్ ఈ, ఇసిఇ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల నిర్వహణకు కంపెనీ డైరెక్టర్ ప్రసాద్ విచ్చేశారు. ముందుగా కంపెనీ విధివిధానాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్ కంపెనీలలో ఉద్యోగం చేయడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కోర్ కంపెనీలో పనిచేయడం వలన దేశానికి ఉత్పాదకత పెంపొందించుకోవచ్చని తెలిపారు. సరాసరి వేతనం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో సమానంగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఈ కళాశాలకు గత మూడేళ్లుగా విచ్చేసి ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులను ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మొత్తం 198 మంది ప్రాంగణ ఎంపికలకు విచ్చేశారు. వీరికి ముందుగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన వారిని ముఖాముఖి, టెక్నికల్ ఇంటర్వ్యూలు తర్వాత హెచ్ఆర్ ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషందర్, ట్రైనింగ్ సిబ్బంది, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

చిట్టేటి నారాయణను పరామర్శించిన ఎమ్మెల్యే మెరిగ మురళి

చిల్లకూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త
మండలంలోని కమ్మవారిపాల్యెం గ్రామ సర్పంచ్, రైతు భరోసా అడ్వైజర్ కమిటీ సభ్యులు చి

గుర్రం జాషువా జయంతి వేడుకలు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడి వీధిలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం సమరసతా వేదిక సారధ్యంలో బోయి భీమన్న, గుర్రం జాషువా జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాహితీ పక్షంలో భాగంగా ప్రాంత ఉపాధ్యక్షులు అంజూరు బాలసుబ్రమణ్యం మార్గదర్శకంలో నిర్వహించిన సభకు ముఖ్యఅతిధిగా కోడూరు సత్యం హాజరయ్యారు.శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు పసల వీరాస్వామి అధ్యక్షతన జరిగిన జయంతి వేడుకల్లో ముఖ్యఅతిధి కోడూరు సత్యం మాట్లాడుతూ గుర్రంజాషువా సమాజంలో వివక్షతలను, కులతత్వానికి వ్యతిరేకంగా రచనలు చేసారన్నారు.దేశ భక్తి,జాతీయాభిమానం కలిగిన మహనీయుడు భరత మాత, శివాజీలపై రచనలు సాగించి యువతను చైతన్యవంతుల్ని చేసారన్నారు.ఈయన రచించిన క్రీస్తు చరిత్రకు జాతీయ పురస్కారం లభించిందని విద్యార్థులకు వివరించారు. బోయి భీమన్న ఒకే జాతి, ఒకే సంస్కృతి అనే ఆలోచనలతో సమాజంలోని వికృతిని తొలగించటానికి గుడిసెలు కాలిపోతున్నాయ్,పాలేరు వంటి అనేక రచనల ద్వారా జాగృతం చేసారన్నారు.ఈ కార్యక్రమాల్లో అంజూరు బాలసుబ్రమణ్యం, కోడూరు సత్యం, పసల వీరాస్వామి, పిళ్ళారి బత్తినయ్య, డివివి శ్రీనివాసరావు, కృష్ణం రాజు, సురేష్, సమరసతా వేదిక కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో పూజలు:పోస్టు కార్డుల ఉద్యమం

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్) సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు అరెస్టు అక్రమమని ఆయన నిర్దోషిగా బయటకు రావాలని ఆదివారం రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి సారధ్యంలో వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.అలాగే రాజమండ్రి జైలుకు పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజాదరణ పొందుతున్న తరుణంలో రాబోవు ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన అధికార పక్షం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకం ప్రకారం సిఐటి వ్యవస్థను చేతిలో పెట్టుకొని అక్రమ అరెస్టులను చేపట్టి జైళ్ళలో పెట్టి తానొక్కడే ఎన్నికలకు వెళ్ళాలని భావిస్తున్నట్లు ఉందన్నారు. సూర్యుణ్ని అరచేతితో ఆపటం ఎవరి సాధ్యమా అని ప్రశ్నించారు.నేడు ప్రజాస్వామ్యం అపహాస్యం పాలౌతుందన్నారు.సిఎంకు ఢిల్లి పెద్దల మద్దతుతోనే ఇలాంటి ఆరాచకాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.విధ్వంసకర పాలనకు సిఎం చరమగీతం పాడాలన్నారు.ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని, అంబేద్కర్ రాజ్యాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు.కళ్ళముందే స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన భవనాలు,కంప్యూటర్లు కనబడుతున్నా,శిక్షణ పొందిన వారు ఉద్యోగాలు చేసుకుంటున్నా ప్రభుత్వం గుడ్డిగా వాదించటం గమనిస్తే ఇది కక్ష సాధింపు చర్య కాదా? అని ప్రశ్నించారు.గురువారెడ్డితో పాటు నియోజకవర్గ మండల నాయకులు కృష్ణవేణి,గుణ యాదవ్, ప్రభాకర్, రాఘవుల యాదవ్, సుబ్బరామిరెడ్డి,,మునీంద్ర,గోల్డ్‌మాన్ నాయుడు, మునేంద్ర యాదవ్, మనీ అనిల్‌కుమార్, రమణ,రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ అభినందనీయం

-డిఎస్పీ భీమారావు

.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ప్రతినెల ప్రత్యేక దివ్యాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈనేపథ్యంలో ఆదివారం స్థానిక నగరివీధి వద్ద ఉన్న కార్యాలయంలో ఏర్పాటుచసిన 142వారం నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిధిగా డిఎస్పీ భీమారావు విచ్చేయగా ఆయనకు సంస్థ అధ్యక్షులు మునీర్‌బాషా స్వాగతం పలికారు. ఈసందర్భంగా డిఎస్పీ భీమారావు మాట్లాడుతూ సమాజసేవ కోసం ముందుకు రావడం మానవతా హృదయం అని అందులో హెల్పింగ్ హ్యాండ్స్ అన్న మంచిపేరుతో ప్రతినెలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకున్ని అభినందించారు. సమాజసేవకులు దేవుడితో సమానమని కొనియాడారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులను పంపిణీచేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాజేశ్వరరావు, గరికపాటిరమేష్‌బాబు, డిల్లీకుమార్, కోళ్ళూరుహరనాథ్‌నాయుడు, హెల్పింగ్‌హ్యాండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అరగుండుకొట్టుకుని తెదేపా నాయకుల నిరసన

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలేదీక్షల్లో భాగంగా పార్టీ ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు విజయకుమార్ సారధ్యంలో రోజు వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆదివారం రాష్ట్ర ఎస్సీ సెల్ తెలుగుదేశంపార్టీ కార్యదర్శి అరగుండుకొట్టి నిరసన వ్యక్తం చేశారు. బాబుతో నేను అన్న ప్లకార్డును చేతపట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రం రావణకాష్టంగా మార్చిన వైకాపా ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెప్తారని రాష్ట్రంలో వైకాపా ఎంఎల్‌ఏలు, మంత్రులు మాట్లాడడం నేర్చుకోవాలని దుయ్యబట్టారు. మాట్లాడడం రానివారు కూడా మంత్రులుగా చెలామణి కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టరమన్నారు. వేలకోట్లు తిన్న జగన్ దర్జాగా సిఎంగా చెలగామణి అవుతున్నారని, ఆయన, మంత్రులు కూడా త్వరలోనే శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్ళడం ఖాయం అన్నారు. ఏతప్పు చేయని చంద్రబాబు త్వరలోనే తిరిగి వస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, దశసధాచారి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెంచయ్యనాయుడు,రాష్ట్ర మహిళా నాయకురాలు బి.రేణుకాదేవి, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి అనిత, కుమారి, సుప్రజ, మండల మహిళా అధ్యక్షురాలు సుభాషిణి, రత్నమ్మ, రాష్ట్ర ఎస్సీ సెల్ గోపినాథ్, నియోకజవర్గ ఎస్సీ సెల్ రమేష్, గుర్రప్పశెట్టి, భాస్కర్‌గౌడ్, శివారెడ్డి, శంకర్‌నాయుడు, కాసరం రమేష్, ఆర్మగం, బిసి నాయకుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, కుమార్, ప్రకాష్, రమేష్, గుర్రప్పశెట్టి, భాస్కర్‌గౌడ్, శివారెడ్డి, శంకర్‌నాయుడు, గాలిమురళీనాయుడు, ప్రకాష్‌నాయుడు, మునిరాజనాయుడు, డివినారాయణ, ఖాదర్‌బాష, అస్మత్, మస్తాన్, జిలానీ, హేమంత్‌కుమార్, ప్రసాద్‌నాయుడు, ప్రతాప్, దొరబాబు, నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), నాగరాజు, బాబు, మణి, యాదగిరి, మునిరాజ, వజ్రం కిషోర్, శేషమనాయుడు, రాజేంద్రనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, సురేష్‌నాయుడు, వెంకటరత్నం, నాగరాజు, శ్రీనివాసులు, కరీం, జిలానీ, మీర్జా, బాబురెడ్డి, చాంద్‌బాషా, మణి, రామచంద్రయ్య, రామ్మూర్తి, గురుమూర్తి, వెంకటరమానాయుడు, సుబ్బారావు, సాయి, వినయ్, సుజిత్‌కుమార్, గోవిందు, భాస్కర్‌నాయుడు, గుత్తావిజయకుమార్‌నాయుడు, భార్గవ్, మణికంఠ, పాండు, ఎంఎస్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అడుగడుగునా మడుగే...!

సత్యవేడు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

సత్యవేడు మేజర్ పంచాయితీ నుంచి వెళ్ళే ఒకీలక రోడ్డు అధ్వానంగా తయారైంది. నాలుగేళ్ళుగా ఈరోడ్డుపై తట్టమట్టి వేసి గుంతలను పూడ్చిన దాఖలాలు లేవు. రెండు గంగమ్మ దేవాలయాలు,ఒక శివాలయం, నియోజకవర్గ స్థాయి క్రీడామైదానం, ఫారసరఫరాశాఖ గిడ్డంగి సముదాయం, ఓనాగాలమ్మ దేవాలయంతో పాటు సమీప తమిళనాడుకు వెళ్ళే రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. ప్రస్తుతం ఈరోడ్డు పంచాయితీరాజ్ శాఖ ఆధీనంలో ఉంది. ఈరోడ్డుమార్గంలో గిడ్డంగి సముదాయం కూడా ఉంది. ఈకారణంగా పెద్ద పెద్ద లారీలతో భారీ టన్నేజ్‌తో బియ్యం సరఫరా చేస్తున్నారు. నాలుగేళ్ళుగా ఈరోడ్డుపై మరమ్మత్తులు లేకపోవడంతో అడుగడుగునా గుంతలు, పలుచోట్ల మడుగును తలపించే విధంగా నీరు నిలిచిపోతున్నాయి. ఈకారణంగా ఆలయాలకు వెళ్ళే భక్తులు, ప్రయివేట్ డిగ్రీ కళాశాలకు వెళ్ళే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఈరోడ్డుపై వర్షపునీరు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోవడంతో తరుచూ ద్విచక్ర వాహన చోదకులు

అందులోపడి గాయాలపాలు కావడం ఎక్కువైంది. -"పోలీస్" అన్నా..మీదే స్పందన..!

మండలం నుంచి ప్రతి రోజు వేల టన్నులతో గులకమన్ను తరలించి బడానేతలు సొమ్ము నింపుకుంటు న్నారు. మట్టిరోడ్లను కూడా భాగుచేయడం మరిచిపోయారు.ఈనేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు తలుచుకుంటే..నాలుగైదు గ్రావేల్ టిప్పర్ లారీలను ఈరోడ్డు మీదకు మళ్ళిస్తే రోడ్డు తాత్కాలికంగా మరమ్మత్తులు చేసుకోవచ్చు. ఆమేరకు సత్యవేడు సిఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిలు చొరవ తీసుకోవాలని సత్యవేడు మండల ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబుతో మేము ఉన్నాం రిలే నిరాహారదీక్ష - గాలి భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు 24 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ చంద్రబాబుతో మేము సైతం అంటూ నింద్ర మండలం ఆధ్వర్యంలో జరిగిన నిరాహారదీక్షలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు తొందరగా బెయిల్ మంజూరు కావాలని ఆయన కడిగిన ముత్యముల బయటకు రావాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన కోరారు. బాబు ఏ తప్పు చేయలేదని అన్యాయంగా కేసు పెట్టి జైలుకు పంపారని ఈ విషయాన్ని అందరికి తెలియజేయాలని తమ గళం వినిపించాలని కోరారు. సైకో పోవాలని, సైకిల్ రావాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నింద్ర మండల పార్టీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఆనందరాజు, ప్రధాన కార్యదర్శి విజయకుమార్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రెసిడెంట్ దశరథ వాసు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సంపూర్ణమ్మ, బాబు యాదవ్, మహేష్, మనోజ్, రమేష్‌నాయుడు, గంగాధరం, వేణు, ఏ.జె.రవికుమార్, రవినాయుడు, బుజ్జి, శివ, ప్రకాష్, ప్రసాద్, సీనియర్ నాయకులు కె.బాలాజీ, కృష్ణారెడ్డి, మీర, పట్టణ ప్రెసిడెంట్ రమేష్‌బాబులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకులను అరెస్టుచేసిన పోలీసులు

నగరి, సెప్టెంబరు 24 ప్రభాతవార్త: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫలో విజయవాడ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెళుతున్న సందర్భంగా సీఐటీయూ అంగన్‌వాడీ నగరి ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనకోటమ్మ, కార్యదర్శి పంచవర్ణంను నగరి పోలీసులు అరెస్టు చేశారు. నగరి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పోరాటంచేసే హక్కు కూడా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. గతంలో అనేక సార్లు మా డిమాండ్ల పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నటువంటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని తెలిపారు. తెలంగాణ కన్నా అదనంగా జీతాలు పెంచుతామని ఎన్నికల సందర్భంగా పాదయాత్రలో హామీ ఇచ్చిన జగనన్న, నేడు గెలిచిన తరువాత అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను గాలికి వదిలేశారని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తయిన కాలయాపన చేస్తున్నారని అరెస్టులతో, లాఠీలతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హుకుం జారీ చేశారు. గతంలోనాటి ముఖ్యమంత్రి నేటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారని అందుకే తగిన గుణపాఠాన్ని నేర్పించి ఇంటికి పంపించడం జరిగిందని ఆ పరిస్థితిని జగన్మోహన్‌రెడ్డి తెచ్చుకోరని ఆశిస్తున్నామన్నారు.

వార్డు మెంబరు భారతిచే గంజి మాధవయ్యకు సన్మానం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:

వేపగుంట వార్డు మెంబరుగా గెలుపొందిన ఏ.భారతి పుత్తూరు మాజీ ఎంపీపీ, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్యని సన్మానించారు. ఎన్నిక జరిగిన సమయంలో ఆయన విదేశీ పర్యటనలో ఉండడంతో నేడు ఆయనను కలసి సన్మానించడం జరిగింది. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉప ఎన్నికల్లో కష్టపడి గెలిచిన వార్డు మెంబరు ఏ.భారతికి, ఆమె విజయంలో కీలక పాత్ర పోషించిన పలువురు నాయకులను గంజిమాధవయ్య తిరిగి సన్మానించారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్, మండల టీడీపీ అధ్యక్షుడు డి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఏ.బాలాజీ, మాజీ అధ్యక్షులు కరుణ, మోహన్‌రాజు, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ శేఖర్‌నాయుడు, టీడీపీ నాయకులు లోకేష్, బుజ్జిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 54వ 'జాతీయ సేవా పథకం' దినోత్సవం

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

ఆదివారం స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల నందు 54వ జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం దత్తత తీసుకున్న గ్రామాలైన వెంకటాపురం, అన్నాసామి పల్లెలోని అంగన్వాడీ విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా భావం,క్రమశిక్షణ,సమాజంపై అవగాహన కల్పించడమే ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశమన్నారు.ప్రతి ఒక్కరూ ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గంలో పయనించాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు.అనంతరం పిల్లలచే ప్రతిజ్ఞ చేయించి వారికి చాక్లెట్లు,కేకులు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యనిర్వాహకుడు డా॥టి.చంద్రయ్య,డా॥కె.సుజన్‌కుమార్,అధికారులు డా॥సి.చంద్రశేఖర్,డా॥షేక్ రఫి కిరణ్,వివిధ విభాగాధిపతులు,అధ్యాపకులు,విద్యర్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సెట్విన్ రెండు రోజుల వర్క్‌షాప్

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

సెట్విన్ ఆధ్వర్యంలో యువతకు నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్(శిక్షణ) కార్యక్రమం ఆదివారం సాయంత్రం ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సృజన్ టెక్నాలజీ ఎండి పి.లక్ష్మీనారాయణ,బాలాజి నర్సింగ్ కాలేజ్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్,సెట్విన్ సిఈఓ డా॥మురళీకృష్ణ విచ్చేసి యువతీ యువకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.అనంతరం డా॥వై.ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి నెల ఇటువంటి వినూత్న కార్యక్రమాలు యువతీ యువకులకు అందించాలని,దీని కోసం తన సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులు మాట్లాడుతూ ఈ శిక్షణ తమ జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని,ఈ రెండు రోజుల కార్యక్రమంలో తాము ఎంతో ట్రాన్స్‌ఫర్ అయ్యామని హర్షం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో పవన్ దేవరకొండ,చక్రధర్,గురు, మనోజ్,కిషోర్,గీత, పర్షియా, హేమంత్,చరణ్,తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పేర్కొన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెప్టెంబర్ 25వ తేది సోమవారం ఉదయం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం అదే విధంగాఅర్జీలు,ఫిర్యాదులుఇచ్చేవారికి కోసం ఉదయం 10.30 నుంచి స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసే వారు 0877 -2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ హరిత తెలిపారు.

సుమనకి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి,సెప్టెంబర్ 24ప్రభాతవార్త: యోగ విభాగం విద్యార్థిని పి.సుమనకి ఆంధ్ర వర్సిటీడాక్టరేట్ ప్రదానం చేసింది. యోగ విభాగంలో ఆచార్య కె.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాద్ తెలిపారు. పలువురు ఆద్యాపకులు, విద్యార్థులు అబినందనలు తెలిపారు.

బేరివారి మండపంలో ఉచిత వైద్యశిబిరం

...లోని బజారువీధిలోని బేరివారి కళ్యాణమండపంలో ...జయవంతం అయ్యింది, పట్టణ ప్రజలు సద్వినియోగం ...న్నైకు చెందిన గజలక్ష్మీబాలయ్య పర్యవేక్షణలో ఉచిత ...క్రమాలకు డాక్టర్ ప్రశాంత్‌సెల్వం ముఖ్యఅతిథిగా విచ్చేసి ...ంఘం అధ్యక్షులు చింతపుల్లయ్య, మండపం మేనేజర్ ... మంది వివిధ రోగాలకు సంబంధించి వైద్యపరీక్షలు జరిపించుకున్నారు. డాక్టర్ ప్రశాంత్ ప్రత్యేకంగా వైద్యపరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు అందించారు.కొందరికి సలహాలు ఇచ్చారు.

చంద్రబాబు విడుదల కావాలని ఆంజనేయస్వామికి పూజలు

తొట్టంబేడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తొట్టంబేడు మండలం కేంద్రంలో కొణతనేరి గ్రామపంచాయతీ మెయిన్‌రోడ్డు వద్ద వెలసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నందు చంద్రబాబునాయుడు త్వరగా విడుదల కావాలని ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ఆంజనేయస్వామికి పూలాభిషేకం నిర్వహించి చంద్రబాబునాయుడు ఆయన కుటుంబసభ్యుపై అర్చనలు, పూజ కార్యక్రమాలు జరిపించారు. జైలునుంచి విడుదలై ప్రజాసేవాలో పునరంకితం కావాలని యువగళం పాదయాత్ర సజావుగా జరగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపిటిసి విజయకుమార్‌నాయుడు,నాయకులు చలపతి, శంకర్‌నాయుడు, పోలయ్యనాయుడు, సాయిబాబానాయుడు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ క్యార్యదర్శి వెంకటసుబ్బయ్య,ప్రభాకర్, చెంచయ్య, పెంచలయ్య, లెక్కలరమేష్‌నాయుడు, గౌరీశంకర్, జనమాలరాజయ్య, వెంకటాచలం, నాని, కమల్‌నాథ్, రఘురామయ్య, చలపతి, వెంకట్రామానాయుడు, బుజ్జినాయుడు, వెంకటాచలపతి, పవన్‌కుమార్, వినోద్‌కుమార్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి నిమజ్జనోత్సవాల్లో అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

వినాయకచవితి నిమజ్జనోత్సవాల్లో భాగంగా ఆదివారం పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనేపథ్యంలో పాతబస్టాండు నాగులగుంట వద్ద తెలుగుదేశంపార్టీ యువతనాయకుడు వంకాయలసిద్దులయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిద్దులయ్యతోపాటు విజయభాస్కర్ మెడికల్స్ అధినేత విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

టిడిపి విజయం ఖాయమనే చంద్రబాబు అరెస్ట్

16 రోజులుగా రిమాండ్‌లోనే ..పోరాటానికే సిద్ధం ! యువగళం పాదయాత్ర పునఃప్రారంభం..!!

టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి !!!

చంద్రగిరి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: 2024 సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలుసుకున్న జగన్ కుట్రపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేసినట్లు టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి తెలిపారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం టిడిపి మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ముస్లీమ్‌లు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారికి సంఘీభావం ప్రకటించిన సుధారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ చేయబడి 16 రోజులు అవుతున్నట్లు ఆవేదన చెందారు. జగన్ పాలనలో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోయాయనీ, రాష్ట్రం అస్తవ్యస్థం కావడంతో ప్రజలంతా చంద్రబాబు నాయకత్వం వైపు చూస్తున్నట్లు తెలిపారు. దీంతో దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఎన్నికలలో గెలవాలని చూశారన్నారు. దొంగ ఓట్లపై టిడిపి చేసిన పోరాటానికి ఎన్నికల కమీషన్ స్పందించడంతో జగన్‌కు దిక్కుతోచని స్థితి ఏర్పడిందన్నారు. నారా లోకేష్ "యువగళం పాదయాత్ర", చంద్రబాబు "భవిష్యత్తుకు గ్యారెంటీ" యాత్రలతో ప్రజల్లో విశేష స్పందన రావడంతో జగన్‌లో వణుకు మొదలయ్యిందన్నారు. చంద్రబాబు అరెస్ట్ ద్వారా మానసికంగా దెబ్బతీయడంతో పాటు ఆయన ఆలోచనలకు అడ్డుకట్ట వేయాలని కుట్ర పూరితంగా వ్యవహరించారని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో టిడిపి భయపడదనీ, తాము పోరాటానికే సిద్ధపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నారా లోకేష్ యువగళం పాదయాత్ర పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నారా కుటుంబ సభ్యులు సైతం పాదయాత్రలో పాల్గొనేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు భయపడవద్దనీ క్యాడర్‌కు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధర రావు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, నాయకులు కన్నయ్య నాయుడు, వీరంగారి రమేష్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, పెరుమాళ్‌పల్లి రఘునాథ రెడ్డి, ఉమాపతి రెడ్డి, జయబాబు, ఏ.జి.పల్లి బాల, గౌస్‌భాషా, కాపువీధి సునీల్, మండలం లోకేష్ రాయల్, ప్రభాకర్ నాయుడు, అనార్కలి, మల్లికమ్మ, సునీత, రేణుక, మన్సూర్, ముంతాజ్, తమీన్, భాషా, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో..వైసిపి ఘోర పరాజయం

-ఎఫ్ఐఆర్‌లో పేరు లేకపోయినా 16 రోజులు రిమాండా?

-టిడిపి నేత ఊకా విజ

వేనాడు దర్గాను దర్శించుకున్న రెహమాన్ సోదరి

తడ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

తడ మండలం వేనాడు దీవిలోని అల్లాతాత దర్గాను గంధోత్సవం తర్వాత పలువురు ప్రముఖులు దర్శించుకుంటున్నారు. ఈ దర్గా వద్ద ఘనంగా గంధోత్సవం ముగిసింది. అప్పట్లో జనం రద్దీగా ఉండటంతో అనంతర రోజుల్లో దర్గా సందర్శనకు ప్రముఖులు విచ్చేస్తున్నారు. సుప్రసిద్ధ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కుటుంబ సభ్యులు చాలాకాలంగా ఈ దర్గా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు. రెహమాన్ సోదరి రెహనా ఆదివారం తెల్లవారుజామున వేనాడు దర్గాను దర్శించుకొని గంధోత్సవం జరిగిన విధానాన్ని స్థానిక ముస్లిం పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలావుంటే కేరళ, చెన్నైలకు చెందిన పలు ప్రముఖ దర్గాల నిర్వాహకులు కూడా వేనాడులోని అల్లాతాత దర్గా సమాధిని దర్శించుకున్నారు.

అంబరాన్నంటిన "గణేష్ నిమజ్జన మహోత్సవం"

చంద్రగిరి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

చంద్రగిరి మండల పరిధిలోని పాతశానంబట్లలో ఆదివారం గ్రామానికి చెందిన యువతీ యువకులు గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని అంబరాన్నంటేలా నిర్వహించారు. ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో విశేషంగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో టి.జయశ్రీ, యం.పావని, యం.చాందిని, డి.శ్రీనిజ, వి.భరత్ రామ్, వి.కేశవన్, కె.పార్థ, కె.నవీన్, కె.అనిల్ యువతీ యువకులంతా ఒక్కటై సొంతూరులో వినాయక చవితిని పురస్కరించుకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఏడు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక స్వామి విగ్రహం ఎదుట 5వ రోజున గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమాలు జరిపించారు. ఏడవ రోజున భక్తులకు అన్నదానం జరిపించారు. ఆదివారం సాయంత్రం గణేష్ నిమజ్జన మహోత్సవం ఉత్సాహంగా జరుపుకున్నారు.

కోలాహలంగా విఘ్ననాయకుడి నిమజ్జనం

చౌడేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా గత వారం రోజులుగా భక్తులచే పూజలందుకొన్న లంబోధరుడి నిమజ్జనాన్ని కోలాహలం గా నిర్వహించారు. ముఖ్యంగా పట్టణం లోని మృత్యుంజయేశ్వరుని ఆలయం, నేతాజీ నగర్, పాతబస్టాండు, షిర్డీసాయి బాబా ఆలయం, బజారువీధి, గాంధీ వీధి, బత్తలాపురం రోడ్డు, నాయుడు క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనం గావించారు. స్థానిక వినాయకయూత్ ఆధ్వర్యంలో కేరళవారి సాంప్రదాయ నృత్యాలు, డప్పులు, దేవరెద్దుల ఊరేగింపు వంటి కార్యక్రమాలు జరిగాయి. వాడ వాడలా వినాయక విగ్రహాల నిమజ్జనాలు వేడుకగా నిర్వహించారు.

తిరుపతిలో నాగబాబును కలిసిన స్వామినాథన్

విజయపురం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :

నగరి నియోజకవర్గం పరిధిలోని నింద్ర మండలంలో వున్న నేతం చెరకు కర్మాగారం యాజమాన్యం నాలుగు సంవత్సరాలుగా రైతులకు బకాయిలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని ఆదివారం తిరుపతిలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుకు చిత్తూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి స్వామినాథన్ ఫిర్యాదు చేశారు. అప్పులతో రైతులు ఇబ్బంది పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే విజయపురం మండలంలో జగన్నాథపురం, మహారాజపురం ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులే అక్రమంగా గ్రావెల్ క్వారీ నిర్వహించడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని తెలిపారు. అధికార పార్టీ నాయకులు ఆదాయమే ధ్యేయంగా కృషి చేస్తున్నారు గాని, అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని స్థానిక తహశీల్దారుకు ఫిర్యాదు చేసి ధర్నాకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు.

సూర్యప్రభపై శేషాచలవాసుడు

చేతిలో శంఖుచక్రాలు,కత్తి,విల్లు,వరదహస్తంతో "రామకృష్ణగోవిందుడు"గా మలయప్ప

తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీనివాసుడి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఆదివారం ఉదయం చేతిలో శంఖుచక్రాలు, కత్తి, విల్లు, వరదహస్తంతో రామకృష్ణగోవింద అలంకారంలో సూర్యప్రభపై దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు ఉదయం శేషాచలవాసుడు సూర్యప్రభామధ్యస్తుడై దివ్యకిరణకాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులను ఆరోగ్యవంతుల్ని చేస్తూ కటాక్షించాడు. గోవింద అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, బోర్డు సభ్యులు సీతారెడ్డి, అశ్వర్థనాయక్,సుబ్బరాజు, శేషుబాబు, టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, సివిఎస్ఒ నరసింహకిశోర్ పాల్గొన్నారు. స్వామివారు అధిరోహించిన సూర్యప్రభవాహనాన్ని టిటిడి అధికారులు సేవకులుగా మోశారు.

రంగురంగుల గాజులు

అఫిక్రాట్ ఫలాలు, రోజామాలలతో మలయప్ప

వెంకన్న ఉత్సవమూర్తులు రంగురంగుల గాజులు,అఫిక్రాట్ ఫలాలు, వట్టివేరు, కురువేరు, రోజామాలలతో శ్రీదేవి భూదేవి సమేతుడై మలయప్పస్వామి స్నపనతిరుమంజనంలో శోభాయమానంగా మెరిశారు.

బంగారుదేవునికి బంగారుగొడుగు

తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాతవార్తప్రతినిధి:

బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజు ఉదయం జరిగే రథోత్సవానికి అలంకరించే బంగారుగొడుగును ఆదివారం సాయంత్రం మిరాశీ దారులు పంతులుగారి రామనాథమ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఊరేగించారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు యానాదయ్య ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో పారిశుధ్యానికి పెద్దపీట : డాక్టర్ శ్రీదేవి

తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల్లో నిత్యంలక్షమంది భక్తులతో దేవునికి జరుగుతున్న సాలకట్లబ్రహ్మోత్సవాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేసి ,అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు టిటిడి ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. 2,500మంది సిబ్బందితో పారిశుధ్యచర్యలు చక్కగా చేపడుతున్నామన్నారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో 243మందిని, గరుడసేవరోజు 774మందిని అదనంగా ఏర్పాటుచేసుకుని, గరుడసేవ రోజు మాత్రం 136టన్నుల చెత్తను తొలగించామన్నారు. రథోత్సవం రోజు మాధవీధుల్లో ఇసుకను తొలగించేందుకు అదనంగా 278మందిని ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఆలయమాధవీధుల్లో భక్తులకు తాగునీటిని అందించేందుకు 230మందిని నియమించామని, అదనంగా 18పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు వైద్యసేవలందించేందుకు నిరంతరాయంగా వైద్యాధికారులు, సిబ్బందిని నియమించి సేవలందించామన్నారు. ఆదివారం ఉదయం తిరుమలలోని మీడియాపాయింట్లో ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, టిటిడి సిఎంఒ డాక్టర్ నర్మద, ఏపిఆర్ఒ నీలిమాతో కలసి పారిశుధ్యం, వైద్యసేవలపై వెల్లడించారు.

విద్యారంగం బలోపేతంకు సమిష్టి కృషి

- రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

ప్రభుత్వ విద్యారంగంను మరింత బలోపేతం చేయడానికి సమిష్టి కృషి చేయాలని రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. విజయవాడలో అక్టోబర్ 1న నిర్వహించనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభ సందర్భంగా ఆదివారం చిత్తూరు జిల్లాలో రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రచార జాత బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంను పరిరక్షించడానికి ఉపాధ్యాయులందరు కలిసి కట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే పాత పెన్షన్ పథకం పునరుద్ధరించే వరకు ఉపాధ్యాయులు విశ్రమించకుండా పోరాటం చేయాలన్నారు. ఈ ప్రచార జాత బైక్ ర్యాలీ పంగనూరు, పలమనేరు, బంగారుపాళ్యం, చిత్తూరు వరకు సాగింది. ర్యాలీలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి రఘుపతిరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి జివి రమణ, నాయకులు సుధాకర్‌రెడ్డి, పిఆర్ మునిరత్నం, రెహనా బేగం, ప్రసన్నకుమార్, కృష్ణమూర్తి, జగన్మోహన్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, ఎస్పీ భాషా, ఎంవి రమణ, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై తేజోమూర్తి ప్రకాశం

తిరుపతిరూరల్, సెప్టెంబర్24 ప్రభాతవార్త:

తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కన్నుల పండవుగా జరుగుతున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీకళ్యాణ వేంకన్న తేజోమూర్తిగా సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిదారుడి అలంకరణలో ప్రకాశించారు. ఉదయం 7గంటల నుండి 7:45 గంటలకు స్వామివారిపై సూర్య కిరణాలు పడటంతో ఆలయ అర్చకులు హారతులు ఇవ్వగా భక్తుల గోవిందనామ స్మరణ చేసారు. వాహన సేవ ముందు అశ్వాలు, వృషభాలు ఠీవిగా నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలలు, కోలాటాలతో స్వామిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ దేవదేవుని సూర్యప్రభ ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి సూర్యునిపై అధిరోహించిన శ్రీవారిని కీర్తించారు.

చంద్రునిపై విహరించిన ఆది నారాయణుడు

శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రునిపై కొలువుదీరి అమృత కిరణాలతో భక్తులకు అభయమిచ్చి, అమృత స్వరూపులను చేస్తారని భక్తుల ప్రతీతి.

నేడు తుమ్మలగుంటలో రథోత్సవం

శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఎనిమిదోరోజైన సోమవారం రథోత్సవం వైభవంగా జరగనున్నది. ఉదయం 6గంటకు స్వామి రథరోహణం చేసి, పుర వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

29న ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని

5కె వాక్కతాన్

తిరుపతి టౌన్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

తిరుపతిలోని అమర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేది ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం 5కె వాక్కతాన్ అలిపిరి దగ్గర నుంచి ప్రారంభించిన జూ పార్క్ వరకు ఐదు కిలో మీటర్లు ఉత్సాహవంతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ జక్కా కులశేఖర్ మాట్లాడుతూ 5కె వాక్ థాన్ నిర్వహించుటకు గల ముఖ్య ఉద్దేశ్యం గుండె సంరక్షణపై ఆరోగ్యకరమైన జీవనశైలి పై అవగాహన కల్పించడానికి గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజు కనీసం 30 నిమిషములు వ్యాయామం చేయాలని తెలిపారు. ఆహారపు అలవాట్లతో కొలెస్ట్రాల్ పెరిగి రక్త సరఫరా సరిగ్గా లేక 25 సంవత్సరాలు వయసులోనే గుండె లయ తప్పుతుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ సరియైన జీవన శైలి ప్రారంభించి మానసిక ఒత్తిడి నుండి, నిద్రలేమి నుండి విముక్తి కలిగించుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరీనేని తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హెల్త్ హార్ట్ ప్యాకేజ్ 699 రూపాయిలకే అందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఈసీజీ, 2డి ఇకో, హిమోగ్లోబిన్, ఎఫ్‌బిఎస్, పిపిబిఎస్, క్రియాటినైన్, కొలెస్ట్రాల్, కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటుందని అమర హాస్పిటల్ సిఎఒ వేణుగోపాల్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరనేని కార్డియాలజిస్ట్ డాక్టర్ శివకృష్ణ, డా. నౌషాద్, డాక్టర్ శంకర్, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయేంద్ర రెడ్డి, ఐఐటి డైరెక్టర్ ఏఎస్‌పి జక్కా కులశేఖర్, యువత స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివయ్య పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళ హస్తీశ్వరుని సన్నిధిలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారం భం కానున్నాయి. భక్తి శ్రద్ధలతో స్థానిక సంప్ర దాయ బద్ధంగా నిర్వహిం చే ఉత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. ఆలయం లోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద సోమవారం శ్రీ-కాళ-హస్తిలను ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు. తరువాత స్వామి అమ్మవార్లకు పవిత్రాలు సమర్పిస్తారు. ఆలయంలో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న పరివార దేవతలకు కూడా పవిత్రాలనుసమర్పించే సంప్రదా యం అమలులో ఉంది. ఆలయంలో నిత్యం జరిగే పూజలు, అభిషే కాలు, సేవలకు సంబంధించి తెలిసి తెలియక జరిగే తప్పిదాలను నివృత్తి చేయటానికి మూలవిరాట్లకు పునరేత్తేజం తెచ్చే విధంగా పూజలను చేపట్టారు. ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ పూజలకు ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది.

మృత్యువు ఒడిలో ఓ తల్లి పోరాటం..!

- బతకాలని తపన.. కానీ బతుకిచ్చేదెవరు
- ఒక పక్క కిడ్నీ వ్యాధి.. మరోపక్క పేదరికం
- ముగ్గురు చిన్నారులకు ఒక్క పూట అన్నం పెట్టలేని దుర్భర పరిస్థితి
- దాతల సహకారం కోసం ఎదురుచూపు

గూడూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

వెంకటమ్మ

గూడూరు తూర్పువీధి గిరిజన కాలనీకి చెందిన పామూరు వెంకటమ్మ అనే నిరుపేద యువతి కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఆమె వయస్సు 30 సంవత్సరాలు. ఈ సమయంలో ఆమె భర్త ఆమెకు తోడుగా నీడగా ఉండాల్సిందిపోయి ఆమెకు కిడ్నీ వ్యాధి వచిచందని ఆమె నాకు ఇంక అవసరం లేదని వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఆమె ఒక్కటిగా మిగిలిపోయింది. ఆమెకు ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. వారి ఆలనపాలన చూడాల్సిన స్థితి నుంచి అన్నం పెట్టలేని స్థితికి వచ్చింది. ఒక తల్లిగా ఉండి కూడా నేనేమీ చేయలేకపోతున్నాను, నా బిడ్డలకు నేను అన్నం పెట్టలేని స్థితి ఉన్నానని తల్లడిల్లుతోంది. చూడటానికి శక్తి లేదు. ఆహారం పెట్టడానికి ఆమె దగ్గర సరైన సరుకులు లేవు. ఆమె ఒంటరిగా పోరాటం చేస్తూ జీవనం సాగిస్తోంది. శివాలయం ఆటోస్టాండ్ వారు రెడ్ సంస్థ వారికి తెలియజేయడంతో దాత సనిశెట్టి వెంకటశ్రీధర్ జ్ఞాపకార్థం వారి కుమారుడు సాయి కృష్ణచైతన్య దాతృత్వంతో ఆదివారం ఒక నెలకు సరిపడా ఫల సరుకులు అందజేయడం జరిగింది. రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, శ్రీనివాస్ ఆచారి, జమీర్, ఆటో స్టాండ్ సభ్యులు శ్రీను, సలీమ్ తదితరులు పాల్గొన్నారు. గూడూరులో దాతలకు కొదవ లేదని, ఎవరైనా ముందుకు వచ్చి సహాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

కాణిపాకంలో నేడు (సోమవారం)

పగలు : అభిషేకం, దేవస్థానం వారిచే : రథోత్సవం

వరుస ఉభయదారులు: కీ॥శే॥ శ్రీ కె.యతిరాజులు నాయుడు, కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి మీనాకుమారి, కీ॥శే॥యన్.శివప్రసాద్ నాయుడు దంపతులు, శ్రీ కె.పూర్ణచంద్రారెడ్డి, మాజీ వి.యం.కాణిపాకం, కీ॥శే॥ శ్రీ కె.చంద్రశేఖరరెడ్డి, మాజీ వి.యం వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు కె.హరిప్రసాద్‌రెడ్డి, కాణిపాకం వారిచే, మండపడి వినియోగం-గంగుండ మండపం వద్ద జరుపబడును.

ఆస్థాన మండపంలో...

సాంస్కృతిక కార్యక్రమాలు : . ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఎం.ఆనందరనాయుడు అరిమాకులపల్లె వారిచే ధార్మికోపాన్యాసము, 12 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్.సుమతి, భాగవతారిణిచే హరికథ, 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు బి.రఘునాథ్, తిరుపతి, 4 గంటల నుండి 6 గంటల వరకు శ్రీకిరణ్ మ్యూజిక్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్, తిరుపతి వారిచే భక్తిగీతాలు, 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీఅభినయార్ట్స్ అకాడమి, విజయవాడ వారిచే భరతనాట్యం నృత్య ప్రదర్శన, 8 గంటల నుండి 10 డాక్టర్ అపర్ణ ప్రసాద్, విజయవాడ వారిచే కూచిపూడి నృత్యం, 10 గంటల నుండి 12 గంటల వరకు శ్రీవిఘ్నేశ్వరనాట్యమండలి నెల్లూరు వారిచే వందన కుంభినీయుద్దం పౌరాణికనాటక ప్రదర్శన, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

అకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన గజవాహనసేవ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను భక్తులను అబ్బురపరచాయి. ఈమేరకు దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆస్థానమండపం వద్ద ఉదయం నుండి రాత్రి వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రాష్ట్రంలోని ప్రఖ్యాత కళాకారులచే ధార్మికోపన్యాసం, కూచిపూడి, భరతనాట్యం, హరికథలు, భక్తి సంగీతకచ్చేరి, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

గణేష్ దీక్ష ఇరుముడులు సమర్పణ

కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

గణేష్‌దీక్ష మాలధారణ చేపట్టిన భక్తులు ఆది వారం కాణిపాకంలో ఇరుముడు లను సమర్పించారు. కాణి పాకం దేవస్థానంలో గత కొన్నేళ్ళుగా గణేష్‌దీక్షా మాలధారణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయం విధితమే. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా గణేష్‌దీక్ష మాలధారణ చేపట్టిన భక్తులు పెద్దఎత్తున ఆదివారం కాణిపాకం చేరుకుని స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు దీక్ష పూర్తి చేసుకుని కాణిపాకం చేరుకుని ఆలయంలో స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. వీరు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన గణేష్‌దీక్షా మందిరంలో ఇరుముడులను సమర్పించారు.

రెండున్నర టన్నుల కూరగాయలు విరాళం

కాణిపాకం,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతునన్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంకు ఓ భక్తుడు ఆదివారం మూడు టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కోసం కర్నాటక రాష్ట్రం హోసూరుకు చెందిన గోపాల్‌రెడ్డి మిత్రబృందం మూడుటన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ ఈఒ వెంకటేశు, ఏఈఒ రవీంద్రబాబు, సూపరెండెంట్ రంగస్వామిలకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదారం ప్రకారం స్వామివారి దర్శనానంతరం తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

సెయింట్ మేరీ చర్చ్‌లో ఘనంగా మేరీమాత ఉత్సవాలు

నగరి, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :

నగరి పట్టణంలోని సెయింట్ మేరీ చర్చ్‌లో ఆదివారం మేరీ మాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. చెన్నైలోని వేలంగిని మాత చర్చ్‌లో ఉత్సవాలను అనుసరిస్తూ ప్రతి ఏటా ఈ చర్చ్‌లో మేరీ మాత పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది పేద దళిత విద్యార్థులకు టి.అమృతరాజ్ నాడార్ విద్యాభ్యాసం కోసం ఆర్థిక సాయం అందించారు. చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా తాను చదువుకోలేకపోయినందున గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది మేరీ మాత ఉత్సవాల సందర్భంగా తన కుమారుడు, కుమార్తె టి.అరుణ్‌రాజ్, ఆరోగ్య జాయిస్‌ల ద్వారా దళిత విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అలాగే పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉత్సవాల సందర్భంగా చర్చ్‌లో బిషప్, ఫాదర్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కడపకు చెందిన బిషప్ గాలి బలి, ఫాదర్లు సెలస్టియన్ పారిష్, చెన్నైకు చెందిన సుసాయ్ ఆంటోనీ, రేణిగుంటకు చెందిన సుసైనాథన్, సైమన్, ఐ.ఆనంద్, నింద్ర మండలం ఇరుగువాయికి చెందిన ఐ.ఆనంద్, సత్యవేడుకు చెందిన ఆరోగ్యదాస్, పిచ్చాటూరుకు చెందిన లూకాస్ నగరి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.